# గతి తప్పిన మనసు

రచన;
శ్రీ జి. ఎస్. కె. సాయిబాబా

సాయంత్రం అయిదయింది. శారదా నదిపైనుండి చల్లని పిల్లగాలులు వీస్తున్నాయి. శరీరానికి హాయి పెడుతున్నాయి. దూరంగా బ్రిడ్జిపై రైలు పెద్ద శబ్దంతో కదుల్తుంది. ఆకాశాన పక్షులు ఆహారంతో గూళ్ళకు చేరుకుంటున్నాయి.

వచ్చి తిన్నెపై కూర్చొని ఏదో ఆలోచిస్తున్నాడు మదన్. దేని గురించో తీవ్రంగా మెదడు పనిచేస్తున్నది. హలో! మదన్! అంటూ వచ్చి ప్రక్కనే కూర్చున్నాడు సుకుమార్.?

యిద్దరూ ప్రాణ స్నేహితులు. ఒక కంచంలో తిని ఒక మంచంపై నిద్రించకపోయినా మనసులు అలా కలిశాయి. ఒకరి మనసొకరదగ్గర విప్పుకుంటారు. వారిద్దరి మధ్య రహస్యాలంటే ఏమిటో, అవి ఎలా వుంటాయో తెలియదు. నిర్మల హృదయములు. రోజూ వ్యాహాళికి అలా నదివొడ్డుకివస్తారు. ఒకరు బిజినెస్ మాగ్నెట్, మరొకరు గవర్నమెంటు ఉద్యోగి.

పలకరించినా పలక్కుండా ఆలోచనల్లో మునిగితేలుతున్న మదన్‌ని చూసి ఏమిటా అంత దీర్ఘాలోచన అని ఆశ్చర్యపోయాడు. మదన్! అంటూ భుజంపై చేయివేసి కదిపాడు,

ఆఁ! అంటూ నిద్రలోనుండి లేచినట్లు ఈ లోకంలో పడి హల్లో కుమార్! ఎంతసేపైంది నువ్వొచ్చి? అడిగాడు,

వచ్చిందిప్పుడే! పిలిచింది రెండో సారి! ఏమిటాలోచన?

నీకు చెప్పకుండానా? అయినా అదొక స్మృతి.

ఏమిటది? కుతూహలంగా అడిగాడు,

మరపురాని, మరువచేక, మరచిపోని, మరువనటువంటి స్మృతి మధురస్మృతి! అన్నాడు నవ్వుతూ,

ఏమిటో అంత స్మృతి? ఈ మధ్య మా సిస్టర్ లేకపోగానే పై స్మృతు లెక్కువయ్యాయా? లేక...

అటువంటిదే! అనుకోని సంఘటనే జరిగింది. అదే స్మృతి! అంటున్నా, ఆలకించు, చెప్పసాగాడు.

ఒకదగ్గరకొక అమ్మాయి వచ్చింది. లక్ష్మి పేరు. వురఫ్ లక్ష్మీకాంతం. బంగారు తీగెలావుంటుంది. మంచి పర్సనాలిటీ. పురుషుల్ని చిత్తుచేసే స్ట్రక్చర్. బ్యూటీ కాంటెస్ట్‌లో నిలబడితే జడ్జీలు మతి పోగొట్టుకుని ఫస్ట్ ప్రైజిస్తారు. సోగ కన్నులు, యాపిల్ బుగ్గలు, దొండపండు లాంటి పెదాలు. రంభ యెలావుంటుందో తెలియదుకాని ఆమెని మించే అందాలరాణి మంచి రూపసి. వూరు శ్రీకాకుళంవద్ద పల్లెటూరు.

పెళ్ళయింది. భర్త అందగాడుకాడు. ఆమె ఆశించేది అందం, చలాకీ కబుర్లు డబ్బుకాదు. ఆమె భర్త తిరుగుబోతు. అందాల భార్య యింట్లో వుండగానే పై తిరుగుళ్ళకిపోయే తిరుగుబోతు. ప్రతిరోజూ ఆమెని హింసించేవాడు. స్త్రీ హృదయం అతి సున్నితం. ఎదురు తిరిగింది. అసహ్యించుకుంది. ఫలితం? మరో పురుషుడ్ని నమ్మింది. అతనే సర్వం అనుకుని నమ్మింది. కావలసినవారిని, వున్న వూరుని విడచి నమ్మినవారితో లేచిపోయింది.

పాపం నమ్మినవాడు గొంతుకోశాడు. వాడుకొన్నన్నినాళ్లు వాడుకున్నాడు. తరువాత చేయరాని ఘోరం చేశాడు. ఎవరికీ ఎవరూ చేయనటువంటి ఘోరం చేశాడు.

ఏమిటది? ఆలకిస్తున్న సుకుమార్ అడిగాడు,

వ్యభిచారి కొంప పంతులమ్మ కంపెనీకి అమ్మివేశాడు. వెయ్యి రూపాయలకి, పాపం ఆ మురికి కూపంలో మ్రగ్గుతుంది. నిజం తెలిసేసరికి పరిస్థితి చేయిదాటింది. అందాల లక్ష్మి వేశ్యగా మారింది. ఈ రోజు ఆమెను మీటయ్యాను.

ఆమె వేశ్య. నేను........అనే భావం కలగటం లేదు. ఎంతో ఆత్మీయంగా, అనురాగంతో,.....ప్రవర్తించింది. నా హృదయంలో చెరగని ముద్ర వేసింది. యిప్పటికి రెండుసార్లు వెళ్ళాను. యింకా ఆమె సాన్నిధ్యంలో గడపాలనుంది. కళ్ళెదుట నిలబెట్టుకోవాలని, అందాన్ని జుర్రాలని ఆనందం పంచుకోవాలని మనసు తహతహలాడుతున్నది. ఇదీ జరిగింది. చెప్తున్న స్వీయ కథకు ఫుల్‌స్టాంపు పెట్టాడు మదన్.

అంతా ఆలకించి దీర్ఘంగా నిట్టూర్చాడు సుకుమార్.

ఆశ్చర్యంగావుంది! అన్నాడు సుకుమార్.

అవును! అదే ఆశ్చర్యంగావుంది! నాకు వివాహం జరిగి ఎనిమిది సంవత్సరాలయింది. యిద్దరు పిల్లలుకూడా. యిప్పుడే వివాహం జరిగిన వ్యక్తిలా నా మనసు గెంతుతుందంటే.....అరోక్తిలో ఆపేశాడు.

మదన్! నీ విషయం కాస్త ముదిరిందనే చెప్పాలి!

వాట్!

యస్! ఎటువంటి వ్యసనంకాని, ముచ్చకాని లేని నీలో నేనిదిచూస్తున్నానంటే బాధగా వుంది పైగా పెళ్ళయి ఎనిమిది సంవత్సరాలయింది. ఈ వయసులో యిటువంటివి అలవడుతున్నాయంటే ఏం చెప్పాలి? ఏం అనుకోవాలి? అదిసరే! అసలు నువ్వేలా ఆ కొంప కెళ్ళావ్! ఆటువంటి వాటిపై నీమనసుపోతే! చిత్రంగా వుంది.

అదే చిత్రం! మీ సిస్టర్ డెలివరీ నిమిత్తం అమ్మగా

రింటికెళ్ళిందిగా? ఎప్పుడూలేని ఈ వెధవకోతి మనసు. అటువైపు లాగింది. ఒక ఫ్రెండ్ తీసుకెళ్ళాడు.

చూడు మదన్! ఈ స్నేహితుల్లో మంచి చేసేవాళ్ళున్నారు. చెడు చేసేవాళ్ళున్నారు. వాళ్ళతో చేరి మనసు కంట్రోల్ చేసుకోవాలి. లేకపోతే ఎక్కడ తేల్తామో మనకే తెలియదు. నీ పరిస్థితికి నా మతిపోతుంది.

ఆమె సహచర్యంలో నాకూ అలాగే వుంది మరువ లేకుండా వున్నాను.

చూడు మదన్; నీపలుకు లాలకిస్తుంటే ఆమెపై నీకెటువంటి అభిమానం వుందో ద్యోతకమవుతుంది, నీకు చెప్పగలంతటి వాడ్ని కాను. అయినా ఈ పరిస్థితిలో చెప్పక తప్పదు. ఆమె చెప్పిన కథ అంతా ట్రూమర్. ఆమె పక్కా వేశ్య. సంసారికాదు, ఆమె నిన్నెంతగా ఆకర్షించిందో చూస్తుంటే మంచి జాడా అనిపిస్తోంది.

వేశ్యలలో కొన్ని రకాలున్నాయి. ఒకటి పురుషుల్నుండి కేవలం డబ్బు ఆశించేవి కొన్ని. నాకు డబ్బు కాదు ముఖ్యం, సుఖంఅనేవి కొన్ని, పురుషుడ్ని అన్ని రకాలుగా ఆకర్షించి తృప్తి కలిగించి మరల మరల రప్పించుకునేవి కొన్ని. ఈ జాతికి సంబంధించిన వారే రకరకాల బాధలు బాధలు చెప్తూ పురుషుల్లోని జాతి గుణం రేకిత్తిస్తారు.

నిన్నే వుదాహరణ, పెళ్లయి ఎనిమిది సంవత్సరాలై, ముగ్గురు పిల్లల తండ్రివి నిన్నే లొంగచేసి అందంగా అల్లిన కథలు చెప్పి ఎంతగా ఆకర్షించిందో చూస్తుంటే ఆమె కళకి జోహార్లర్పించక తప్పదు. ఆమెచేసేది వేశ్యావృత్తి ఆమెలో ఆ కళ లేకపోతే విటులు ఆకర్షించబడరు. వచ్చిన విటుడి కోసమే తను బ్రతుకుతున్నట్లు, మసలుతారు. అప్పుడే వారికి డబ్బుదాసోహం అంటుంది.

గడపదాటిన తరువాత నీ వెవరో ఆమెవరో. ఆమెని నీవు మరువ లేవు. కాని ఆమె నిన్ను కించింతంనైనా తలవదు.

యవ్వనం పొంగే పాలువంటిది. పొంగే పాలని నీళ్లు జల్లి పొంగకుండా ఆపాలి. యవ్వనంలో కోర్కెల్ని కళ్ళెవేసి ఆపాలి. లేకపోతే ఫలితాలు వృద్ధాప్యంలో అనుభవించక తప్పదు.

వివాహం చేసుకునే ముందు, పంచభూతాల సాక్షిగా భార్యాభర్తలు ఒకరికొకరు తోడునీడగా వుంటామని, వీడిపోమనీ ప్రమాణాలు చేస్తారు. పురుషులు వాటినుల్లంఘిస్తారేమో కాని, స్త్రీలు మాత్రం వాటి నాచరిస్తూ భర్తని కంటికి రెప్పలా కాపాడుకుంటారు. వయసులో తిరిగిన తిరుగుళ్ళకు వృద్ధాప్యంలో జబ్బులు విజృంభిస్తుంటాయి.

కష్టాలలో సుఖాలలో పాలు పంచుకునే అర్ధాంగి దిక్కవుతుంది కాని మురిపించి మెరిపించే ఈ వేశ్యలు సేవచేయరు మదన్, నీ మంచిగూర్చి చెప్తున్నాను. వేశ్యాలోలుడవు కాకు. నమ్మిన సిస్టర్‌కి అన్యాయం చేయకు. ఇవన్నీ నేను చెప్పవలసినవి కావు. నీకు తెలిసినవే. ఎటొచ్చీ లక్ష్మీకాంతం ఆకర్షణలో పడి మరచి వుంటావు అంతే కమాన్. దీని కింతటితో స్వస్తి చెప్పు. నీకేదో పట్టిన గ్రహం ఆటువైపు తీసుకుపోయింది. అది వదిలిందనుకో. ఏదీ చేతిలో చెయ్యేసి వొట్టువెయ్యి. అంటూ చెయ్యిచాపాడు సుకుమార్.

♦

సూర్యరాజ్ పిక్చర్స్ వారి

“మావూరి మొనగాళ్లు”

చిత్రంలో

కృష్ణ - విజయలలిత

♦

